## తారాశశాంకం

—జి.ఎస్. సాయినాథ్

ఈ వారం శని చాలా అనుకూలంగా వున్నాడు. మీరు నిర్వహించే వృత్తి ప్రశాంతంగా, హాయిగా వుంటుంది. కావలసిన డబ్బు సరిగ్గా అనుకున్న సమయానికొస్తుంది. ఈ వారం అప్పుల బాధ వుండదు. రుణ దాతలు బాగా గౌరవిస్తారు. మీ భార్య మిమ్మల్ని ప్రేమించడమేకాదు పూజిస్తుంది. ఆడవారికి నూతన వస్త్రాల ప్రాప్తి. ఈ వారం మీకు దివ్యంగా వుంటుంది.

వార ఫలాలు చదువుకుంటూ ఇల్లు చేరాడు ఆనందం. ఇతగాడికి జాతకాల పిచ్చి ఎక్కువ. పేపరుగానీ, పత్రికగానీ కొనగానే ముందు రాశి ఫలాలు మాత్రమే బుద్ధిగా చదువుతాడు.

గుమ్మంలో చిరునవ్వుతో ఆహ్వానం పలికింది భార్య లోకేశ్వరి. ఎప్పుడూ లేనంత హుషారుగా ప్రతి మాటా చిరునవ్వుతో సౌమ్యంగా మాట్లాడుతూ భర్త అడక్కుండానే వేడిగా టీ తీసుకొచ్చి ఇచ్చింది. పంచదార కాస్త ఎక్కువ వెయ్యడం వలన ఆనందం హాయిగా లొట్టలేస్తూ తాగేశాడు.

"ఏమిటో శ్రీమతిగారు ఎప్పుడు లేంది యివాళ ఇంత హుషారుగా వున్నారు?" అటూ బుగ్గమీద చిటికేస్తూ "ప్రేమగాని ఎక్కువయి పోయిందా!" అనడిగాడు.

"ఛీ పోండి నేనెప్పుడూ ఇలా ఆనందంగానే వుంటాను. మీరే పదేపదే చిరాకు పడుతూ నన్ను చులకన చేస్తున్నారు" అంది గోముగా ముఖం పెట్టి.

"ఎప్పుడూ చిటపట లాడుతూ దెప్పి పొడుస్తుండే లోకేశ్వరి ఇవాళ ఇంత ఆనందంగా వుందంటే రాశి ఫలాల కారణమే. అంటే ఈ వారమంతా నా భార్య ఇలాగే హాయిగా వుంటూ నాకు ఆనందాన్ని ఇస్తుందన్నమాట!

ఎంతయినా జాతకరత్న సత్యసామ్రాట్ శాస్త్రిగారు రాసింది అక్షరాలా జరిగి తీరుతుంది" అనుకున్నాడు ఆనందం.

టీ తాగగానే జేబులోంచి జీతం డబ్బులు తీసి భార్యచేతిలో పెట్టాడు. ఆ తర్వాత స్నానం చేసి "ఏవోయ్! ఎటు ప్రోగ్రాం? సినిమా కెళదామా?" భార్యని అడిగాడు.

"మీ ఆనందమే నా ఆనందం. నేను ఎప్పుడో తయారయి పోయాను. మీదే ఆలస్యం. వచ్చేప్పుడు అలాగే హోటల్లో టిఫిన్‌చేసి వచ్చేద్దామండి, మళ్ళీ వంటెందుకు" అంది లోకేశ్వరి.

"అప్పుడప్పుడు హోటల్లో తింటే కాస్త వెరైటీగా వుంటుందోయ్. ఏమంటావ్?" అడిగాడు ఆనందం డ్రస్ అవుతూ.

ఆ తర్వాత వారి కార్యక్రమాలు జాలీగా గడిచిపోయాయి.

ఆ మర్నాడు ఆనంధం భార్య స్వయంగా భర్తకు తలంటుపోసింది. ఆఫీసుకు వెళ్లేముందు ఇంటిగేటు వరకు వచ్చి టాటా చెప్పింది కూడా.

సాయంత్రం భర్త ఆఫీసు నుంచి రాగానే వెంటనే స్నానానికి వేడినీళ్ళు పెట్టి 'ఆఫీసులో అందరి కళ్ళూ మీమీదే పడుంటాయి' అంటూ దిష్టి తీసింది. భార్య సేవలకు మురిసిపోయాడు ఆనందం.

స్నానం చేసి ప్రశాంతంగా కూర్చోగానే బియ్యం అప్పేసే గుర్నాధం వచ్చాడు. ఆనందాన్ని చూడగానే వికార ముఖాన్ని చేటంత ఆనందంగా మార్చుకుని 'నమస్కారం సార్' అన్నాడు.

'రండి రండి కూర్చోండి. మీ గురించే అనుకుంటున్నా. లోకేశ్వరీ, 'గుర్నాధంగారి బాకీ డబ్బులు తీసుకురా' అని కేకేశాడు.

కాసేపట్లో లోపలినుంచి లోకేశ్వరి నూట యాభయి రూపాయిలు తీసుకొచ్చి గుర్నాధానికి ఇచ్చింది. గుర్నాధం అతి వినయంగా డబ్బు తీసుకుని జేబులో పెట్టుకుంటూ "మీలాంటి వారికి అప్పులిచ్చినా గ్యారంటీ వుంటుంది. ఇదే మీ పక్కింటి సుబ్బారావు చూడండి, ఇప్పటికి నాలుగుసార్లు తిప్పితిప్పి సగం డబ్బులిచ్చాడు. ఎంతైనా మీలాంటి నిజాయితీ గలవారు ఎవరూ వుండరంటే నమ్మండి" అని తెగ పొగిడి వెళ్ళిపోయాడు.

తర్వాత కిరాణాఖాతా, పాలవాడు వచ్చారు. వారికీ డబ్బులిచ్చి పంపేశాడు. వారు కూడా ఆనందాన్ని పొగిడి మరీ వెళ్ళిపోయారు.

అప్పులవాళ్ళ పొగడ్తలు విని తబ్బిబ్బై పోయాడు ఆనందం.

'నిజంగా రాశి ఫలాల్లో చెప్పినట్టే అప్పుల వాళ్ళు కూడా ఎంత మెచ్చుకుంటున్నారు!' అనుకున్నాడు.

ఇంతలో భార్యామణి టీ తీసుకొచ్చి ఇచ్చి "ఏమండీ! శ్రావణమాసం చీర కొనిపెడతానన్నారుగా" అంది ముద్దుగా.


"ఔనను శ్రావణమాసం కదా! పద నీకు నచ్చిన చీర కొనుక్కుందువు గాని" అంటూ టాయ్‌లెట్ అయ్యాడు ఆనందం.

భార్య సమేతంగా బట్టల షాపులు ఐదారు తిరిగి ఆఖరికి లోకేశ్వరికి నచ్చిన చీర ఒకటి తీసుకున్నాడు.

"ఎలా వుందండీ చీర?" అనడిగింది లోకేశ్వరి.

"చీర చాలా బావుంది. నువ్వు కట్టుకుంటే ఇంకా అందంగా వుంటుంది" అన్నాడు ఆనందం.

ఆ మాటలకు మురిసిపోయిన సతీమణి "ఏమండీ! ఇప్పటికే చాలా టైమ్ అయిపోయింది. హోటల్లో టిఫిన్ చేసి వెళదామా!" అంది.



"ఊ. కానీ" అంటూ భార్యను హోటల్‌కి తీసుకెళ్ళాడు.

ఇలా ఆ వారం మొత్తం చాలా ప్రశాంతంగా హాయిగా గడచిపోయింది.

రెండో వారం మొదలయ్యింది.

అలవాటు ప్రకారం రాశి ఫలాలు చదువుకుంటూ ఇంటికొచ్చాడు ఆనందం.

"ఈ వారం కుటుంబంలో చిన్న చిన్న కలతలొస్తాయి. సర్దుకుపోతే మంచిది. వృత్తి సక్రమంగా చేయలేక పై అధికారులతో మాట పడవలసి వస్తుంది. అప్పులు చేస్తేగాని కుదరదు. ఈ వారం ధనాదాయం అంతగా కన్పించడం లేదు. ఖర్చులు అధికం జాగ్రత్త వహించండి."

జాతకం చదువుకుని కొంచెం నిచారించాడు. 'అవునుమరి అన్ని రోజులూ ఆనందంగా ఎలా వుంటాయి? జీవితమన్న తర్వాత అన్నీ ఓర్చుకోవాలి అనుకుని సర్దుకుపోయాడు ఆనందం.

మొదటి వారమంతా ఎంతో ఆనందంగా వున్న భార్య లోకేశ్వరి ఈ రోజు ఎదురుకాలేదు. నవ్వుతూ ఇంకా టీ ఇవ్వలేదు.

టీ ఇస్తుందేమో అని చాలాసేపు చూశాడు ఆనందం. కాని అటువంటి సంఘటన జరిగేలా అన్పించలేదు. ఇంక వుండబట్టలేక "లోకం... లోకం... ఏదీ టీ ఎక్కడ?" అని పిలిచాడు.

"అబ్బబ్బా! ఏమిటండీ ఆ అరుపులు! అంట్లు తోముతున్నా. బయటనుండే కదా వచ్చారూ! ఓ అర్ధ రూపాయి పడేసి తాగి రాకూడదూ! ఇంట్లో కూడా టీ పొడి లేదు" చెప్పింది లోపల్నుంచే విసురుగా.

"టీ పొడి అయిపోతుందనుకుంటే మొన్నే చెడవొచ్చుగా! రెండొందలు తగలేసి చీర కొనుక్కోవడం తెలిసినప్పుడు అలసిపోయి ఇంటికొచ్చిన మొగుడికి టీ ఇవ్వాలని తెలీదా" మరీ చిరాగ్గా అరిచాడు ఆనందం.

"అంతే లెండి! మిమ్మల్ని కట్టుకున్నప్పుడే అనుకున్నాను. 'పెళ్ళానికి చీరకొని రోజుకి మూడుసార్లు దెప్పే వారు ఈ ప్రపంచంలో మీరొక్కరే అని! పోన్లేండి ఇకనుంచి నాకేవీ వద్దు. నాఖర్మ ఇంతేనని తగలడతాను" అని పెద్దగా ముక్కు చీదుకోవడం మొదలెట్టింది.

పరిస్థితి విషమించేట్టు వుందను కున్నాడు ఆనందం. రాశి ఫలాల్లో రాసినట్టు సర్దుకుపోవడం మంచిదని "అదికాదే అయిపోయినప్పుడు చెప్తే వెంటనే తీసుకొచ్చేవాడిని కదా! టీ తాగకపోతే నాకు తల నొప్పిగా వుంది" అన్నాడు నెమ్మదిగా.

"రోజూ టీ తాగేది మీరేగా ముందు రోజు అడగొద్దు? రేపటికి టీపొడి వుందా అయిపోయిందాని?" డొంక తిరుగుడిగా మొగుడిమీద తప్పు నదేసింది లోకేశ్వరి.

"ఛ... ఛ... ఈ ఆడవాళ్ళంతా ఇంతే" అంటూ విసుక్కున్నాడు మెల్లిగా!

అవా ఆ మాటలు కూడా భార్య చెవిలో పడ్డాయి. "నేను కాక ఇంకెంత మందితో కాపురం వెలగపెడుతున్నా రేంటి? ఆడవాళ్ళందరూ ఇంతే నంటు న్నారు" అంది దెబ్బలాటకు సిద్ధమయిపోయినట్లు.

"అయ్యో రామా! ఇదేంటే శ్రీరామా అంటే బూతు మాట అన్నట్టుంది నీతో. ఇకపోతే మాట్లాడడం నావల్లకాదు కానీ కొత్త నోరు మూసుకు తగలడు" అన్నాడు విసుగోయింగా

ఈ విధంగా ఇంట్లో పరిస్థితులు బాగోకపోయేసరికి ఆనందం పనులు బాగోలేక పరధ్యానంగా పనులు చేస్తూ మేనేజర్‌తో తిట్లు తినసాగాడు.

ఆ వారమంతా ఆ విధంగా గడిచి పోయింది.

అటు ఇటుగా, అప్పులతో మిగతా రెండు వారాలు ఈ విధంగానే సాగిపోయాయ్.

మళ్ళీ కొత్త నెల వచ్చేసింది.

"మీ కృషికి ప్రతిఫలం అందుతుంది. దానితో కొన్ని కష్టాలు గట్టెక్కుతాయి. దాంపత్య జీవితం సాఫీగా వుంటుంది. అనుకూలమైన దాంపత్యం కావడం వలన మీకు దేనికీ లోటుండదు. సమాజంలో బోల్డంత గౌరవం లభిస్తుంది. ఈ వారం హాయిగా ఆనందకరంగా సాగిపోతుంది."

రాశి ఫలం చదువుకుంటూ ఇంటి కొచ్చాడు.

మళ్ళీ భార్య గుమ్మంలో చిరు మందహాసంతో ఆహ్వానించింది. ఈ సారి ఆనందానికి ఆనందం కలగలేదు సరికదా అసలు కిటుకు అర్థమై పోయింది.

'మొదటి వారం సాధారణంగా నాలాంటి వారికి జీతాలు వస్తాయి కాబట్టి ఆనందంగానే వుంటుంది. భార్యామణులు వారి కోరికలు తీర్చు కుంటారు. కనుక ప్రసన్నంగా వుంటారు! రెండవ వారం నుంచి మామూలే! అనుకున్నాడు.

*

తెలుగులో ఏ పత్రికా నిర్వహించని సరికొత్త అభిప్రాయ సేకరణ

# ఘోర దర్శిని టి.వి. అవార్డులు

భారత దేశపు మధ్యతరగతి ప్రజలకు వినోద వికాసాల్ని, విజ్ఞానాన్ని అందించడంలో దూరదర్శిని నలుపుతున్న కృషి ఎంతైనా అభినందనీయం.

అయితే అధిక శాతం ప్రేక్షకులు మోజుపడి చూసే సీరియల్స్‌లో ఏవి ఎంతవరకు తమను సంతృప్తి పరుస్తున్నదీ, ఏయే ధారావాహికలు తమను ఆకట్టు కోవడం లేదన్నదీ వారే సహేతుకంగా చెప్పగలరు. అందువల్లనే సర్వ్యమర్య ఎప్పుడూ ప్రగతికి సోపానమే అని విశ్వసిస్తూ ఈ అభిప్రాయ సేకరణ ప్రవేశ పెడుతు న్నాము. హైదరాబాద్ దూరదర్శన్ వెలువరించే సీరియల్స్‌కు మాత్రమే ఈ శీర్షిక పరిమితం.

ప్రతి వారం మేము ప్రచురించే ఈ కూపన్‌ను ఏ వారానికి ఆ వారం పూర్తి చేసి పంపండి. ఉదాహరణకు ఈ సంచిక 1వ తేదీకి అన్ని ప్రదేశాలకూ చేరు తుంది కనుక 2వ తేదీ శనివారం నుంచి ఏడు రోజుల్లో ప్రసారమయ్యే ధారావాహికలు ఈ కూపన్ పరిధిలోకి వస్తాయి. అలా నాలుగు వారాలపాటు కూపన్లు మాకు చేరాక మెజారిటీ పాఠక ప్రేక్షకుల నిర్ణయం ప్రకారం ఏ సీరియల్ ఏ స్థానాన్ని సంపాదించుకున్నదీ ప్రకటిస్తాము.

ఈ ఒపీనియన్ పోల్ ఏ సంస్థనూ, ఏ వ్యక్తిని కించపరచేందుకు ఉద్దేశించింది కాదు.

ఇది కేవలం అభిప్రాయ సేకరణ మాత్రమే! దీనిపై ఎటువంటి అభ్యంతరాలైనా నిస్సంకోచంగా తెలియజేయవచ్చు!

— ఎడిటర్

పరమచెత్త సీరియల్: - - - - - - - -
ప్రసారం తేదీ/సమయం: - - - - - - - -
కారణం: - - - - - - - - - -
- - - - - - - - - - - -
పాత్రధారుల నటన: ________
దర్శకత్వం: ________
చిత్రీకరణ: ________

చెత్త సీరియల్: - - - - - - - -
ప్రసారం తేదీ/సమయం: - - - - - - - -
కారణం: - - - - - - - - - -
పాత్ర ధారుల నటన: - - - - - - - -
దర్శకత్వం: - - - - - - - -
చిత్రీకరణ: - - - - - - - -

మనికిమాలిన సీరియల్ - - - - - - - -
ప్రసారం తేదీ/సమయం: - - - - - - - -
కారణం: - - - - - - - - - -
పాత్రధారుల నటన: - - - - - - - -
దర్శకత్వం: - - - - - - - -
చిత్రీకరణ: - - - - - - - -